

ప్రైలుగోడయ దూరమవుతున్న కొద్దీ కిష్టప్పలో ఆవేదన ఎక్కువవుతోంది. వళ్లు పట పట లాడించాడు.

అక్కడే దారిపక్కనే పడుకున్న కుక్క చెవులు టపటప లాడించి తోక ముడిచింది. పారిపోతున్న ఆ కుక్కని మరో కుక్క ఎదుర్కొంది. ఎదుర్కొని పూరుకోలేదు. కయ్యానికి కాలుదువ్వింది. ఒక వర్నాట ఆరంభమైంది

నడుస్తున్న కిష్టప్పనే అనుసరిస్తూ కుక్కలు కొట్లాడుకుంటున్నాయి. నిజంగా వాటికి కిష్టప్పని అనుసరించాలని లేదు. కాని దెబ్బలాటలో ఒకచోట నిలకడ లేకుండా ఒక వైపుకు సాగిపోతున్నాయి. కాకతాళీయంగా అది కిష్టప్పనడిచే దారే అయింది!

అసలే కిష్టప్ప బుర్రలో జోరీగ లాడు తున్నాయి. మొదట్లో కుక్కల కవర్నాటం పట్టించుకోలేదుగాని వాటి గొడవ తనని అనుసరించేసరికి జోరీగలు జుయ్యమని రేపాయి.

'ఛస్..., నీయమ్మ!...'

అంటూ ఒక కుక్కని గట్టిగా తన్నాడు. తన్నులిన్న కుక్క పరుగెట్టలేదు. వెను దిరిగ ఒక కాటువేసింది. రెండో తన్నుకు

అందకుండా పరుగు లంకించుకుంది. ప్రత్యర్థి కుక్క దాన్ని వెంబడించింది.

కాలు పట్టుకొని చూసుకున్నాడు కిష్టప్ప.

పళ్ళు స్పష్టంగా కనిపించాయి; రక్తం స్రవిస్తూ రాజుతున్న కొరివిలా కనిపించాయి.

పెద్దచెట్టు విరిగి వొరిగిపోతున్న చప్పుడైంది. ఆ చప్పుడు చెట్టు విరిగిందానిది కాదు. కిష్టప్ప మళ్ళీ పటపటలాడించిన పళ్ళు!

కాలి చెప్పుతీశాడు. కుక్క కరిచినచోట తప తపా వాయించాడు.

కుక్కకాటుకి చెప్పుదెబ్బ! ... దూరంగా రైలుకూత వినిపించింది. 'వెంటనే కసి తీర్చుకో, వెంటనే కసితీర్చుకో, కసితీర్చుకో, కసి తీర్చుకో, కసితీ......' అన్న రైలు శబ్దం!

వెనక్కి తిరిగి చూశాడు. జైలుగోడలు ఇంకా కనిపిస్తూనే వున్నాయి.

'శంద్రిగా!...' అనుకున్నాడు కసిగా. అదేపేరు పైకికూడా అన్నాడు.

జేబులు వెతుక్కున్నాడు. బీడీ లెలా వుంటాయి? లేవు! ప్రక్కనేవున్న బడ్డీ కొట్టుదగ్గరి కెళ్ళాడు.

'సరుకుంది కిష్టా ... మంచిసరుకు' అన్నాడు బడ్డీకొట్టు శంకరయ్య పళ్ళికిలిస్తూ.

'ఛస్! నోర్మూసుకొని బీడికట్టిట్టా పారేయ్...' అన్నాడు కిష్టప్ప.

'ఇంకా పులుసు పావలేదు' అని గొణుక్కుంటూ అగ్గిపెట్టెతో సహా బీడీకట్ట తెచ్చిచ్చాడు; శంకరయ్య.

శంకరయ్యవైపు అదోలా చూస్తూ బీడీ వెలిగించుకున్నాడు కిష్టప్ప.

ఆ చూపుకు మరోమరోడయితే హడలి చచ్చేవాడేగాని శంకరయ్య జంకలేదు. ముఖంనిండా నవ్వు పులుముకుని 'సరుకు మాటేం జేశావ్...' అన్నట్టు చూస్తూ కూర్చున్నాడు.

బీడీ వెలిగించుకోవడమైన తరువాత అగ్గిపెట్టె శంకరయ్య ముఖానికేసి కొట్టాడు కిష్టప్ప.

నవ్వుముఖం మాడ్చుకొని ముక్కు తుడుచుకొని మామూలుగా కూర్చుండి పోయేడు శంకరయ్య.

అప్పుడే వచ్చిన గిరాకీని పరామర్శించ సాగాడు.

కిష్టయ్య అక్కడ్నించి బయల్దేర బోయేముందు సోడా ఒకటి తీసి 'టుంయ్య' మనిపించి సగం తాగాడు. తక్కిన సగం కుక్క కాటు మీద పోశాడు. అక్కడ్నుంచి కదిలి వెళ్ళిపోయాడు.

వచ్చిన గిరాకీ చూసుకుంటున్నా శంకరయ్య కళ్ళన్నీ కిష్టప్ప మీదనే వున్నాయి.

బీడీ కట్టకి డబ్బు లివ్వకపోతే మానె సోడాకీ ఇవ్వలేదు. పోనీ—పోతేపోయింది అనుకుంటే—ఎదవ తాగేసిన సోడాకాయ పట్టుకుపోయాడు.'

సోడాకాయ పోయిందని చాల బాధ పడ్డాడు శంకరయ్య.

'ఎవరది? సెల్లమ్మకి కావల్సినోడు కాదూ...?'

'అవును. నాకు మెల్లి మొగుడులా దాపురించాడు.'

గిరాకీ నవ్వాడు.

'అయితే జైలు యిడిసిపెట్టేసిందన్న మాట...?'

ఆఁ...ఆఁ...జైలు ఇడిసిపెట్టేసింది... సెల్లమ్మ యిడిసి పెట్టేసింది ... పొవరోసం జూస్తే బుసలుకొడ్తున్నాది; ఏం జేత్తాడో చూద్దాం... యెదవనాయాలు ... అడుక్కుతినాల...!'

సోడాకాయ పట్టుకపోయాడన్న కోపం మాటల్లో చూపించాడు శంకరయ్య.

వచ్చి వచ్చి ఒక గుడిసె ముందాగాడు కిష్టప్ప. గుడిసెకో తలుపుంది. తలుపు వేసే వుంది గని తాళం లేదు

'శంద్రిగా...' అని పిలిచాడు. సమాధానం రాలేదు...లోపల అలికిడైనట్టు వినిపించింది.

'శంద్రిగా...' కాస్సేపూరుకొని మళ్ళీ పిల్చాడు. వాడి పేరు నోటితో పిలవకూడదనుకొన్నాడు. కాని తప్పడం లేదు. అందుకే తుపుక్కున వుమ్మినట్టుగానే బుడుక్కున 'శంద్రిగా' అని అంటున్నాడు. ఆ అనడంలోనే శంద్రిగాడి మీద వుండే అసహ్యం, జుగుప్స బహిర్గతమవుతున్నాయి.

లోపల అలికిడైనా... ఎవరూ తలుపు తియ్యడం లేదు కసిగా తలుపుని ఒక తన్ను తన్నాడు దభుక్కున క్రిందపడింది తడిక తలుపు.

అక్కడ దృశ్యం...?

కిష్టప్ప కళ్ళు చింత నిప్పులయ్యాయి... ఆవేశంతో వూగిపోయాడు. వొళ్ళు మరిగిన కోపంతో సలసలా కాగి పోయాడు!

ఒక్క వురుకున లోపలికి జొరపడ్డాడు.

'సెల్లా!...' అని గర్జించి సెల్లమ్మ జుట్టు పట్టుకున్నాడు. సెల్లమ్మ హడిలి పోయింది, పూర్తిగా కొయ్యబారి పోయింది. ఆమె అలవోకగా చుట్టుబెట్టుకున్న చీర జారి పోయిరది.

'స్సీ...ఎదవముండా' అని కోపాన్నంతా చేతిలోకి కేంద్రీకరించి ఒక గుద్దు గుద్దాడు; నెత్తిమీద.

సెల్లమ్మ స్పృహ తప్పి నేల కొరిగి పోయింది.

చుట్టూ కలియజూసాడు కిష్టప్ప. నరమానవుడి జాడ కనిపించలేదు.

'పారిపోయాడు ఎదవనాయాల...' అనుకున్నాడు గుడిసె వెనక్కాల సందుచేసిన వైపుచూసి.

ఆసందులోనుంచే తనూ బయటికి వచ్చాడు.

ఆ చుట్టునక్కలంతా గాలించాడు. ఎవరూ కనిపించలేదు.

'దాటిపోయాడు ఎదవనాయాలు' అనుకున్నాడు చేతిలో చేయివేసి గుద్దుకుంటూ.

మనుషుల్లో అజ్ఞానం అలుముకున్నట్టుగానే చీకట్లు ముసురుతున్నాయి...దిక్కులు నల్లనవుతున్నాయి.

చిన్నగా తుంపర ఆరంభమైంది. చల్లనిగాలి శరీరాన్ని కంపింప చేస్తోంది.

కిష్టప్పదగ్గర బీడీకట్ట అయిపోయింది.

ఆఖరి దమ్ములాగి శంకరయ్య బడ్డీ కొట్టువైపు నడకసాగించాడు.

దూరాన్నుంచే కిష్టప్పనిచూసి...గుండె దిటవు చేసుకున్నాడు శంకరయ్య సోడా కాయ తిరిగిస్తాడని.

తెల్లవార్లూవుండే బడ్డీ కొట్టది.

ఎక్కడా దొరకని సరుకంతా అక్కడే దొరుకుతుంది.

అందుకే రాత్రుళ్ళప్పుడు కూడ గిరాకీ ఎక్కువ.

తెల్లవార్లూ మనుషులు వచ్చిపోతూనే

వుంటారు.

బల్లమీద కూర్చున్నాడు కిష్టప్ప. పెట్రోమాక్స్ లాంతరు వెలుగులో ఆతని చేతుల్ని కళ్లతోనే వెదికేసాడు శంకరయ్య.

ఫర్వాలేదు...సోడాకాయుంది!

ఎర్రటి ద్రవం గ్లాసులోకి వంచి 'బుస్సు'మని సోడాకాయకొట్టి బజబజా అందులో పోసాడు శంకరయ్య.

దాన్ని కిష్టయ్యకి అందిస్తూ అన్నాడు.

'ఏం కిష్టా! బొంబి గుమ్మడమున్నారు... విజవే సుమా...'

కిష్టప్ప వాడికి సమాధానం చెప్పలేదు. గ్లాసందుకుని గటగటా త్రాగేసాడు.

గ్లాసుతిరిగి తీసుకుంటూ సోడాకాయకేసి చేతులు జాపాడు ఇస్తాడేమోనని.

అబ్బే అలాంటి ధ్యాసే వున్నట్టులేదు.

ఇంకోగ్లాసు, ఇంకోగ్లాసు ఇంకోగ్లాసు నిండుగా ఎర్రద్రవాన్ని ఇచ్చాడు శంకరయ్య. ఇచ్చేకొద్దీ చేయి చాపుతూనే వున్నాడు కిష్టప్ప.

'ఇంకపోలు గురూ! ఇప్పటికే శానా అయిపోయింది' అన్నాడు డబ్బు లివ్వాలిమరి అన్నట్టుగా.

గళ్లలుంగి మడతల్లోకి చేయిపోనిచ్చాడు కిష్టప్ప. శంకరయ్య ఆశగా చూశాడు.

బొడ్డుదగ్గర మడతల్లో భద్రంగా దాచిన దాన్ని బయటికి తీసేశాడు కిష్టప్ప. గుడ్డి వెలుతురులోకూడా అది జిగేలుమంది.

మంగళ సూత్రం.

వుస్సురని నిట్టూర్చాడు శంకరయ్య అయితే ఇంకా ఆశ చావలేదు.

మంగళసూత్రాన్ని శంకరయ్య కళ్ల ముందు పెట్టాడు.

శంకరయ్య గుండెలు గుబగుబ లాడాయి బిక్కుబిక్కుమంటూ చూశాడు.

'శంద్రిగాడెక్కడ...?' మాట స్పష్టంగా రాలేదు—కిష్టప్ప తూలాడు.

గుడ్లు మిటకరిస్తూ చూసాడు శంకరయ్య సమాధానం చెప్పలేదు.

'సెప్పవేం?' ఉరిమాడు కిష్టప్ప.

'నువ్వెళ్లావుగా ... అవళ్లేదూ ? ... అన్నాడు నంగినంగిగా శంకరయ్య.

'ఎవరది: కిష్టప్పే... ! ఎప్పుడొచ్చావురా... ? యేందీ:త ... వత్తావత్తానే పూటుకినావు...?' అన్నాడు కిష్టయ్యని పరామర్శిస్తున్నట్టుగా అక్కడి కొచ్చిన ఒకడు.

పక్కవాళ్ల మాటలు ఆలకించేంత స్థిమితంగా లేడు కిష్టప్ప. ఒకసారి అవైపు చూశాడు.

నాయుడిగారి పాలేరు సింగన్న.

శంకరయ్య సోడాబుడ్లు, సారాకాయలు అందించాడు. సంచిలో వేసుకుంటూ—

'నిషామీదున్నట్టున్నావ్ ... నిషా తగ్గాక రా...నాయుడుగారు నీకోసం సూస్తున్నారు' అన్నాడు సింగన్న.

'ఊఁ...' బరువుగా మూలిగాడు కిష్టప్ప. సింగన్న వెళ్లిపోయాడు.

'యేరా...సెప్పు... శందిరిగాడెక్కడ?' అన్నాడు సింగన్న దాకతో దాచిన మంగళ సూత్రాన్ని బయటికి తీసి.

'ఇదో కిష్టా ! అయిందేదో అయిపోయింది. ఇంకా ఎందుకు సెప్పు...' అన్నాడు శంకరయ్య కిష్టప్పని చల్లబరచాలనే వుద్దేశ్యంతో.

'శ్శ...నోర్మూయవే...పిరికినాయాలా.. పిరికి కబుర్లాని...' అన్నాడు విసుగ్గా కిష్టప్ప.

'ఒకసారి జైలుకెళ్లొచ్చావుగందా ... ఇప్పుడొచ్చావో లేదో మళ్లీ ఎల్లడమెందుకావి...'

చివరిమాటలు వాన్నేశాడు.

కిష్టప్ప చేతిలోని సోడాకాయని బల్లకేసి కొట్టాడు కోపంగా— మట్టాడి పోయింది. రెండు కత్తుల్లా మొనదేలింది సీసా.

దాన్ని శంకరయ్య కంఠం దగ్గరగా పెట్టాడు.

'మంగళసూత్రం మాసయినా గావకం తెచ్చుకోరా యెదవ నాయాలా ! ఒకసారి జైలుకెళ్లినా వందసార్లు ఎళ్లినా ఒకటేరా...! తప్పేదియ్యా... శందిరిగాడు దొంగనాల నాయాలి ... మళ్లీ జైలుకెళ్లాలి...'

అన్నాడు ఆవేశంగా ఆయాసంగా.

'అన్నా అన్నా ... అదే కూడదంటూంట...ఇంకా ఎందుకు గొడవ ... నాయుడిగారి దగ్గర కుదురుకో: రోజు మెల్లిపోద్ది...'

'శ్శ...నోర్మూయ్ యెదవనాయాల... యెదవ నాయాలాని...' అని తుపుక్కున ఉమ్మాడు కిష్టప్ప.

మొహం తుడుచుకొని కిష్టప్ప వి కోపంగా చూసింది పక్కగా నిలబడ్డ ఎంకి.

'ఏంది మావా! యిదేనా రావడం...? ఎట్టా...?' అంది కిష్టప్పని ఎగాదిగా చూస్తూ.

ఆమె కంటికి కిష్టప్ప చేతిలో మంగళ సూత్రం సదరుగా ఆనింది,

'సూత్తావేంటి...! కట్టేయ్ ... నా మెళ్లో కట్టేయ్...నా కంటే సక్కనైందేటి ఆ రంకుల సెల్లమ్మ...'

అంది కిష్టప్ప చేత చాలకాలంగా మెళ్లో తాళి కట్టించుకోవాలని వువ్విళ్లూరుతున్న యెంకి.

'హోరు ముయ్యి సిగ్గులేందానా...? పెళ్లంటే నాయుడి పక్కలో దొల్లడం కాదే...?'

అన్నాడు సణియ్యన లేస్తూ కిష్టప్ప.

క్రీనీడలో ఓ నీడ తారట్లాడం గమనించాడు కిష్టప్ప. నీడని బట్టి మనిషిని వూహించాడు.

నరనరాలు వుద్రేకంతో పొంగిపోయాయి. అమాంతం లంఘించి పారిపోవాలని ప్రయత్నించే శంద్రిగాడి మీద పడ్డాడు. కత్తిలాంటి సోడాబుడ్డి చేతులోనే వుంది.

వొళ్లు తెలియని ఆవేశం అతడ్ని హంతకుడ్ని చేసేసింది. మరుక్షణంలో రక్తం! రక్తం మడుగు!

కెవ్వున అరిచి అక్కడ్నించి పారిపోయింది యెంకి. శంకరయ్య పారిపోవటానికి పంచె యెగగట్టాడు. కిష్టప్ప లేచాడు.

'వురే కిష్టి ... ' ఎవరిదో బలహీనమైన కంఠం అతడ్ని కట్టేసింది. రక్తం మడుగులో చూశాడు. ఎవరిదో కాదు ఆ పిలుపు శంద్రిగాడిదే

'ఒక్కమాటరా...సివరగా ఒక్కమాట వినిపోరా ... ' అన్నది గొంతు ఎలానో పెగుల్చుకొని. రక్తపుమడుగు దగ్గరగా వెళ్లాడు కిష్టప్ప వెళ్లకూడదనుకుంటూనే. వాడి ముఖం చూడకూడదనుకుంటూనే.

'సెల్లెమ్మబతుకు అన్యాయం అయిపోయింది. నువ్వా అన్యాయం సెయ్యకురో...

ఆరోగ్య అనారోగ్య
పరిస్థితులలో మహిళలు
ఆరోగ్య
సౌభాగ్యములకు లోధ్ర
ఆధారపడునది
60 సంవత్సరముల పైగా
ప్రసిద్ధినొందినది




కేసరి కుటీరం
(ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట, మద్రాసు-14
ఏజెంట్లు
సీతారామ జనరల్ స్టోర్సు (ఏజన్సీస్)
విజయవాడ - సికింద్రాబాదు - మధుర.
విశాఖపట్నం? - బెంగుళూరు



[illegible]

శ్రీ బాలాజీ వైద్యశాల,
డా॥ పి. కుమారస్వామి పేపర,
టి. బి. రోడ్, తెనాలి.

వాయిదాల చెల్లింపుపై ట్రాన్సిస్టర్



“బా బా”
హామీతో
3 బ్యాండ్, ఆల్‌వరల్డ్
పోర్టబుల్ ట్రాన్సిస్టరు నెలకు రు. 5/- వంతున చెల్లించే పద్ధతిన పొందండి. ప్రతి గ్రామమునకు, నగరమునకు పంపగలము. నేడే వ్రాయండి:
HIND AGENCIES (67)
Kolhapur Road, Delhi-7.

# కర్త కర్మ క్రియ

సెల్లమ్మ నా సెల్లెల్లాంటిదిరా... నువ్వు దానిబతుకు అన్యాయం సెయ్యకు.'

అన్న మరుక్షణంలో అతనినోరు పడి పోయింది. హంస ఎగిరిపోయింది.

కిష్టప్పలో మనిషి మేల్కొన్నాడు.

'సెల్లమ్మ... సెల్లెలు... సెల్లెమ్మ... సెల్లెలు' ఇవే అతని తలలో సుడిగుండాల్లా తిరుగుతున్నాయి.

ఆ సుడిగుండాల్లో పదేళ్ల క్రిందటి పెళ్లిపందిరి కనిపించింది — సన్నాయి వినిపించింది.

తను పెళ్లిపీటలమీద కూర్చున్నాడు. చుట్టూ అవిరేడు బానలు. ఏదో వింతయిన ఆనందం...

పక్కన సెల్లమ్మ కూర్చునే సమయమయింది.

'సెల్లమ్మ కనపడ్డంలేదు' అన్నా రెవరో...! కలకలం లేచింది.

చేతులో మంగళసూత్రంతో పరుగెట్టాడు. ఇల్లంతా వెదికాడు. సెల్లమ్మ కనిపించలేదు. ఏమయింది? ఏమయింది?

చెట్టూ పుట్టంతా వెదికేశాడు.

గడ్డిమేట్లో కనిపించింది సెల్లమ్మ.

బట్టలన్నీ తొలగిపోయున్నాయి

ఆమె నిండు యవ్వనం వెన్నెల్లో ఆరబెట్టినట్లుగా వుంది.

'సెల్లమ్మా...సెల్లా!' అని అరిచాడు తను.

దూరంగా పెద్దలైట్లు వేసుకుని నాయుడుగరు, పాలేళ్లు వచ్చారు.

ఆ వెలుగులో సెల్లమ్మ బాబు మల్లూ కనిపించాడు.

మల్లూ మల్లూలా లేడు. రక్తం గుడ్డలో చుట్టిన ముద్దలా పడివున్నాడు.

సెల్లమ్మ కోలుకుంది.

'నాబతుకు అన్యాయమయి పోయింది మావా...' అంది నీరసంగా.

'ఎవరాడు...? ఎవరాడు...?' ఆత్రంగా అడిగాడు తను.

'శంద్రిగాడు మా బాబుని సంపేశాడు' అంది. ఇంకా ఏదోచెప్పబోయి స్పృహతప్పి పోయింది.

శంద్రిగాడి కోసం వెదికాడు తను. నాయుడుగారు పాలేళ్లు వెదికారు. ఎక్కడా దొరకలేదు.

పోలీసులు వచ్చారు.

పోలీసులతో పాటు శంద్రిగాడు కూడ వచ్చాడు.

సెల్లమ్మ పుట్టినప్పట్నించి కిష్టప్ప పెళ్లామే. కిష్టప్ప చెడుతిరుగుళ్లు మల్లూకి నచ్చలేదు. శంద్రిగాడి కిచ్చి చేయాలనుకున్నాడు. మల్లూని కిష్టప్ప భయపెట్టాడు. ఒకసారి పెద్ద కొట్లాట కూడా అయింది. అది పోలీసుల దాకా వెళ్లింది.

ఇప్పుడు మల్లూ హత్య! కిష్టప్ప పెళ్లి!

వెంటనే పోలీసులు కిష్టప్పని తీసుకెళ్లారు

శంద్రిగాడు బలమైన సాక్షి!

కళ్లు లేని న్యాయం కటకటాల్లోకి తోసింది!

ఒకటి కాదు, రెండు కాదు—పదేళ్లు! కఠిన శిక్ష!!

ప్రేమించిన నేరానికి, పెళ్లి చేసుకుంటున్న నేరానికి శిక్ష పదేళ్లు?

'ఏరా...మల్లూ మావని సంపేసని అబద్ధం సాక్ష్యం చెప్పావుగా ... ఇప్పుడు శంద్రిగాడ్ని సంపా. నువ్వు సూత్తుండగా సంపా. సెప్పు సాచ్చెం...! తప్పదియ్యాల, నీ సావుకు నేను సాచ్చెం సెబుతాలే!...'

అంటూ శంకరయ్యమీదికి రాబోయాడు కిష్టప్ప.

శంకరయ్య ప్రాణాలు పైనే పోయాయి.

పరుగెత్తికెళ్లి నాయుడుగారి కాళ్ల మీద పడ్డాడు. అతడ్ని తరుముకు వచ్చిన కిష్టప్ప రూపం చూస్తుంటే నాయుడు గారికి కంపరం పుట్టుకొచ్చింది.

'ఏంట్రా కిష్టా ఎప్పు దొచ్చావ్... ఈ గొడవంతా ఏవిటి?' అన్నాడు నాయుడు తెచ్చి పెట్టుకున్న ధైర్యంతో.

నాయుడ్ని చూస్తూనే ఆగిపోయాడు కిష్టప్ప. నరనరాల్లోను హరాయించుకున్న పుష్ప స్వామి భక్తికి సలాం కొట్టింది.

వెనుదిరిగి పోయాడు.

పోయి శంద్రిగడింట్లోకి వెళ్లాడు.

సెల్లమ్మ వొంటిమీద చీర చుట్టబెట్టుకొని పడుకుని నీరసంగా మూలుగుతోంది.

ఆమెను లేపి కూర్చోబెట్టాడు.

'శెప్పే ముండా...శంద్రిగాడితో కులుకుతున్నావు కదూ...నన్ను జైలుకు సాగనంపినోడితో కులుకుతున్నావు కదూ...సెప్పవే' అంటూ లెంపలు వాయించాడు.

'అవును మావా...నిన్ను జైలుకు పంపినోడితోనే కులుకుతున్నా ... శంద్రిగాడితో కాదు......నాయుడు గారితో......' అంది సెల్లమ్మ ఓపిక చేసుకుని.

అసలు కథ అప్పుడర్థమైంది.

కిష్టప్ప పెళ్ళికి నాయుడు కూడా వచ్చాడు—పెళ్ళి పందిట్లోకి కాదు. గడ్డివాము దగ్గరికి. కిష్టప్ప అర్జంటుగా మాట్లాడాలి రమ్మంటున్నాడని శంకరయ్యతో సెల్లమ్మకి కబురైంది.

సెల్లమ్మమీద కన్నేసి ఉంచాడు నాయుడు.

కిష్టప్ప అక్కసుగా ఉన్నాడు.

మల్లన్ని ఎగదోశాడు. కిష్టప్ప మీద చెప్పరానివన్నీ చెప్పాడు. మల్లన్న మనసును విరిచేసాడు

కిష్టప్ప పెళ్ళి!

అంటే సెల్లమ్మ తనకు కాకుండా పోతుంది...? అంత అందమూ, అంత యవ్వనమూ, అంత ముగ్ధత్వము కిష్టప్ప సొమ్మయిపోతుందన్నమాట.

పెళ్ళయ్యేలోపున ఏదో చేయాలి! ఎలా!

గడ్డివాము దగ్గర కాపేసి, శంకరయ్య సాయం తీసుకొన్నాడు.

కిష్టయ్య కాకితో కబురంపితే వచ్చేస్తుంది సెల్లమ్మ.

గడ్డివాముదగ్గిరికి పరిగెత్తుకొచ్చింది నాయుడికి బలైపోయింది!

అకస్మాత్ సంఘటనకి స్పృహ తప్పి పడిపోయింది. తండ్రి మల్లన్న వచ్చాడు నాయుడితో కలపడ్డాడు.

శంద్రిగాడు సూశాడు.


స్వామి భక్తిని ప్రకటించుకోడానికిదే సమయం! మల్లన్నతో హోరాహోరీ పోరాటం సాగించి.

మల్లన్న రక్తం మడుగులో కుప్ప కూలాడు.

తర్వాత తెలిసింది—గడ్డివాములో సెల్లమ్మ సంగతి!

పొరపాటు తెలుసుకున్నాడు, మొత్తుకున్నాడు.

'పోలీసులు వస్తారు...పట్టుకుపోతారు'



అన్న నాయుడి మాట తుపాకీ దెబ్బలా పని చేసింది. పారిపోయాడు శంద్రిగాడు.

సెల్లమ్మ సంగతి ఎవ్వరికీ తెలియకుండా వుంచే హత్యా రహస్యాన్ని కాపాడుతానని నాయుడు మాటిచ్చారు. పోలీసులకు పట్టివ్వకుండా దయతలచి వదిలేసాడు.

హత్యానేరం తప్పిపోయింది.

కిష్టప్ప హంతకుడు.

తగినంత సాక్ష్యం బలంగా దొరికింది.

సెల్లమ్మ చచ్చిపోవాలనుకున్నది, కాని చావలేక పోయింది. శంద్రిగాడు ఆమెకు ధైర్యం నూరిపోసాడు. చెల్లెమ్మలా చూసుకుంటానని మాటిచ్చాడు. అతని ఆదరణ ఆమెకి కొండంతబలం ఇచ్చింది.

మానంపోయిన యిల్లాలు— మానాన్ని పోగొట్టినవాడ్నే భర్తగా నమ్మకొంది. వాడికే సర్వస్వం అర్పించేస్తోంది! గుండె రాయి చేసుకుని తెలియని సంతృప్తితో శేష జీవితం గడిపేస్తోంది.

# కర్త కర్మ క్రియ

నాయుడు సెల్లమ్మ బాగోగులు చూస్తూనే వున్నాడు.

వస్తూ పోతూనే వున్నాడు రహస్యంగా.

సెల్లమ్మ గర్భవతి అయినప్పుడు ఆమెకి భర్త కావలిసి వచ్చాడు.

శంద్రిగాడు శుద్ధ పిరికివాడు.

మల్లాన్ని చంపిన నేరానికి ఆ బాధ్యత తన నెత్తిన వేసుకున్నాడు. తనకి సెల్లెమ్మ చెల్లెలు లాంటిది! లోకం దృష్టిలో సెల్లమ్మ శంద్రిగాడి భార్య!

ప్రసవించింది సెల్లమ్మ నాయుడు పిల్లవాడి పోషణకి భయపడ్డాడు. శంకరయ్య సాయంతో సెల్లమ్మని సెల్లమ్మగానే మిగిల్చాడు.

పిల్లలుంటే అడ్డమని...!

శంద్రిగాడు చావలేక బ్రతుకుతున్నాడు.

చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం కోసం ఎదురుచూస్తూ బ్రతుకుతున్నాడు కిష్టప్ప కోసం పడిగాపులు పడివున్నాడు.

వచ్చినిజం తెలిసింది.

కిష్టప్ప తప్పు తెలుసుకొన్నాడు.

జుట్టు పీక్కున్నాడు. తల గోడకేసి బాదుకున్నాడు. తను వచ్చేముందు కన్నం లోంచి పారిపోయింది నాయుడన్నమాట...!

'నాయుడా...' అని గట్టిగా అరిచాడు.

పూరిపాక జవజవ లాడిందా అరుపుకి.

పాకలోంచి వాకట్టే పరుగు తీసాడు.

నాయుడింటికి వెళ్ళేదారిలోనే పోలీసు లడ్డొచ్చారు.

తప్పించుకోడానికి వీల్లేకుండా అడ్డొచ్చారు.

శంద్రిగాడి హత్యకి శంకరయ్య సాక్ష్యం...!

నాయుడిగారి అండదండలు.

మళ్ళీ శిక్షపడినరోజున తన జీవితం గురించి మధనపడలేదు కిష్టప్ప.

'సెల్లమ్మా...!' అని అరిచాడు.

అప్పటికే సెల్లమ్మ ఈలోకంలో లేదు.

ఏదో లోకంలోంచి సమాధాన మిచ్చింది.

ఆ సమాధానాన్ని కోర్టుగోడలు ప్రతిధ్వనించాయి.

'నాయుడా వస్తాను. మళ్ళీ నీ కోసం వస్తాను... నీసావు సూస్తాను...'

అన్నాడు కసిగా పళ్ళు నూరుతూ కిష్టప్ప. కుక్కకాటు, చెప్పుదెబ్బ రెండూ బాధపెడుతూనే వున్నాయి.

మళ్ళీ వస్తాడో రాడో ఆ న్యాయానికి తెలియాలి!

మళ్ళీ కసి తీర్చుకుంటాడో లేదో ఆ చట్టానికి తెలియాలి!

నాయుడుమాత్రం ఎప్పటిలా చీకూ చింతాలేకుండా వున్నాడు. సెల్లమ్మ లేని లోటు ఎంకి తీరుస్తూనే వుంది. శంకరయ్య సోడాకాయలు, సారాబుడ్లు సప్లయి చేస్తూనే వున్నాడు.

కసిగా దొర్లిపోతున్న కాలంలో— కిష్టప్ప కటకటాల్లో పండి పోతున్నాడు!

